రాష్ట్ర అవతరణ వేడుకలకు ఏర్పాట్లు

అధికారులతో సమావేశమైన కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి

జవహర్‌నగర్, మే 29: రాష్ట్ర అవతరణ వేడుకలు వైభవంగా నిర్వహిద్దామని, ఇందుకు సంబంధించి పనులు వేగవంతం చేయాలని జవహర్‌నగర్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్ల కోసం అధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వో ప్రభాకర్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, సంగీత, శ్రీదేవీ, రజినీపాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శామీర్‌పేట, మే 29 : మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని అలియాబాద్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ నిక్మార్ ఫీడర్ పరిధిలోని నిక్మార్ కళాశాల, హెరిటేజ్ కంపెనీలు, కీర్తి ఫౌల్ట్రీ, తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

ఎమ్మెల్యే బండారిని కలిసిన భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్



సమస్యలపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న భగాయత్ సభ్యులు

రామంతాపూర్,మే 29 : ఉప్పల్ భగాయత్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ మేకల హనుమంతారెడ్డి, సభ్యులు గోనె అర్జున్ రెడ్డి , పలువురు సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. జీహెచ్ఎంసీ అధికారులు ఉప్పల్ భగాయత్‌లో ప్రాపర్టీ టాక్స్ వసూలు చేస్తున్నా.. కనీసం రోడ్లు,పరిసర ప్రాంతాల శుభ్రతను పట్టించుకోవడం లేదన్నారు. లేఔట్ మొత్తం చెత్తతో నిండిపోయిందన్నారు. లేఔట్‌లో ఎక్కడికక్కడ డ్రైనేజీ పొంగుతుందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్ట్రీట్ లైట్స్ వెలగడం లేదన్నారు. రాత్రిపూట ఇళ్లలో దొంగలు పడుతున్నారని, స్ట్రామ్ వాటర్ 80 ఫీట్ల రోడ్లపై పొంగుతుందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, నవీన్, సురేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శోభ, రవళి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు వైద్యశాలలో చికిత్సపొందుతున్న తెలంగాణ జాగృతి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఈగ సంతోశ్‌ను బుధవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అతనిపై దాడి చేసిన వారిని గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. – రామంతాపూర్,మే 29

ఆలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం..

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మౌలాలిలోని మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం వార్షికోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

మల్కాజిగిరి, మే 29: నియోజకవర్గంలోని దేవాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో జూన్ 1నుంచి 3 వరకు జరగనున్న మౌలాలి డివిజన్, హెచ్‌బీ కాలనీ ఫేజ్-2లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం 22వ వార్షికోత్సవానికి హాజరు కావాలని కోరుతూ కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వార్షికోత్సవంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని పండుగలను అధికారికంగా నిర్వహించారని అన్నారు. దేవాలయాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు పైళ్ల బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్‌వీ రమణారావు, లక్ష్మిరెడ్డి, లక్ష్మీప్ర భావతి, కార్యదర్శి కేబీ ప్రసాద్, జితేందర్‌రావు, సంజీవరాణి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేయవద్దు..

మల్కాజిగిరి, మే 29: ప్రజల ఆరోగ్యం కోసం రోడ్లపై చెత్త వేయవద్దని మల్కాజిగిరి సర్కిల్ శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మౌలాలి డివిజన్, గాంధీనగర్‌లో 'బస్తీ ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా రోడ్లపైన చెత్త వేయవద్దని ఇంటింటికి వెళ్లి సంప్రదాయంగా మహిళలకు బొట్టుపెట్టి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. తడి-పొడి చెత్తను వేయడానికి ఇప్పటికే గత ప్రభుత్వం రెండు బుట్టలను అందజేసిందని అన్నారు. ఉదయాన్నే కాలనీలు, బస్తీలకు వచ్చే ఆటో ట్రాలీల్లో చెత్త వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పుష్ప, బుడంపల్లి శ్రీనివాస్, అజయ్, అంజయ్య, మనీషా, తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో రోడ్లపై చెత్త వేయవద్దని అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పచ్చిరొట్ట విత్తనాల స్టాక్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మేరీరేఖ

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

మేడ్చల్ కలెక్టరేట్, మే 29 : పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మేరీరేఖ కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ ఏడాది గతేడాది కంటే ఎక్కువ విత్తనాలు రైతుల వినియోగార్థం అందుబాటులో ఉంచామన్నారు. 347 క్వింటాళ్ల విత్తనాలు ఉన్నాయని, పీఏసీఎస్, ఎఫ్ఎస్‌సీఎస్‌ల నుంచి రైతులు పొందవచ్చని ఆమె సూచించారు.

విత్తన కొనుగోలుపై రైతులకు అవగాహన

బండమాదారం గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మేడ్చల్ రూరల్, మే 29: వ్యవసాయ సాగు కోసం విత్తన కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మేడ్చల్ మండలంలోని లింగాపూర్, బండమాదారం, పూడూర్, మునీరాబాద్ గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అర్చన, విస్తీర్ణ అధికారులు సుమిత, తేజశ్విని, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

జూన్ 1న నృత్య సంగీతంపై ప్రసంగం

చిక్కడపల్లి, మే 29 : సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి 65వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న భారతీయ శాస్త్రీయ నృత్య సంగీత రీతుల ప్రసంగ పరంపరలో భాగంగా నృత్యసంగీతంపై ప్రత్యేక కార్యక్రమాన్ని జూన్ 1న త్యాగరాయగానసభలో నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయ్‌కుమార్ తెలిపారు.

1 నుంచి కీసర ప్రసన్నాంజనేయస్వామివారి జయంత్యుత్సవాలు

కీసర, మే 29 : కీసరలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో జూన్ 1న స్వామివారి జయంత్యుత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో 1న ఉదయం 5.30గంటలకు మాన్యసూక్త హోమం, లక్ష్మీగణపతి హోమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకం, స్వామివారి తీర్థప్రసాద వితరణ చేపట్టడం జరుగు తుందని, సాయంత్రం 6గంటలకు కీసర ప్రధాన చౌరస్తాలోని ప్రధాన వీధుల్లో స్వామివారి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులందరు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు జయంతి ఉత్సవాల్లో భాగంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి ఉన్న భక్తులు భక్తమండలి సభ్యులతో కలిసి సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ఉత్సవాల నిర్వహణకు ఆర్థిక రూపేణా దాతలు ముందుకు రావాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు

కీసర, మే 29: కీసరలోని శ్రీ వరాల అయ్యప్ప ఆలయంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో స్వామివారికి ధూపదీప నైవేద్య ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కీసర అయ్యప్ప భక్తమండలి అధ్యక్షుడు నల్లా బాల్‌రెడ్డి తెలిపారు. ఈ ఆలయంలో ప్రతి బుధవారం స్వామివారికి పంచామృతంతో ప్రత్యేక అభిషేకం నిర్వహించడం జరుగుతుందన్నారు.

1న శివారెడ్డిగూడ ఆలయంలో...

ఘట్‌కేసర్, మే 29 : జూన్ 1న హన్‌మాన్ జయంతి సందర్భంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ శివారెడ్డిగూడ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కొంతం రాంరెడ్డి తెలిపారు. ఆలయంలో గణపతి పూజ, ఆంజనేయ విగ్రహానికి పంచామృత అభిషేకం,అష్టోత్తర శత కలషాభిషేకం,అష్టోత్తర శతనామ పూజలు, మంగళహారతి, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6గంటలకు ఆంజనేయ స్వామివారి పల్లకి సేవ వంటి కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ధర్మకర్త రాంరెడ్డి వివరించారు.

విద్యుత్ శాఖ ఏఈకి వినతి పత్రం సమర్పిస్తున్న కౌన్సిలర్ ఉమానాగరాజు

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

మేడ్చల్, మే 29 : మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీలో లో వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని 16వ వార్డు కౌన్సిలర్ నడికొప్పు ఉమానాగరాజు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన.. విద్యుత్ శాఖ ఏఈని కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీలో నెలకొన్న వోల్టేజీ సమస్య కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి కండక్టింగ్ వైర్లు మార్చాలని, నూతనంగా స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు.

పార్టీ పటిష్టతకు సమన్వయంతో పనిచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

ఉప్పల్, మే 29 : పార్టీ పటిష్టతకు సమన్వయంతో పనిచేయాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకులు బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. బుధవారం హబ్సిగూడలో పార్టీ నేతల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు అంశాలపై చర్చించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం కోసం పార్టీ శ్రేణులు కృషిచేయడం, నియోజకవర్గంలో పార్టీ నేతలు, కార్యకర్తల పనితీరుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, కార్పొరేటర్లు కక్కిరేణి చేతన, బండారు శ్రీవాణి, సీనియర్ నాయకులు రాగిరి మోహన్‌రెడ్డి, పద్మారెడ్డి, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఉప్పల్, మే 29 : ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు తోడ్పాటు అందిస్తామని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నా రు. ఉప్పల్‌లో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు పలు కాలనీలకు చెందినవారు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పరమేశ్వర్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల కోసం పనిచేస్తూ, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, నేతలు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో ప్రజలతో మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి

విద్యార్థుల వికాసానికి కృషి చేయాలి

మేడ్చల్ కలెక్టరేట్, మే 29 : విద్యా సంస్థలు విద్యార్థుల వికాసానికి కృషి చేయాలని నాగారం మున్సిపాలిటీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి శ్రీనివాసనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కిడ్జీ ప్లే స్కూల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా వృత్తి అతి పవిత్రమైనదని, ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వహించి, విద్యార్థుల ఎదుగుదలకు బీజం వేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, పంబల రమేశ్, ప్రిన్సిపాల్ మంజు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ చంద్రారెడ్డి

తూంకుంటకు చెందిన బొల్లెబోయిన అభిషేక్‌యాదవ్ గత సంవత్సరం మృతి చెందగా బుధవారం ఆయన జయంతి సందర్భంగా మూడుచింతలపల్లి మండలం, జగ్గంగూడలోని హోం ఫర్ డిసెబుల్‌లో అన్నదానం చేపడుతున్న కుటుంబ సభ్యులు మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, సుభాష్‌యాదవ్, కౌన్సిలర్ రాజ్‌కుమార్ యాదవ్‌లు –శామీర్‌పేట, మే 29

విద్యార్థి అదృశ్యం

తరుణ్(ఫైల్)

మేడ్చల్, మే 29 : ఓ విద్యార్థి అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...మేడ్చల్ మండలం సైదోనిగడ్డ తండాకు చెందిన తరుణ్(21) గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువు తున్నాడు. మంగళవారం ఉదయం 9 గంటలకు కళాశాలకు రూ.10వేలు తీసుకొని ఫీజు కట్టడానికి వెళ్లాడు. అయితే కళాశాల ప్రిన్సిపాల్ తరుణ్ కళాశాలకు రాలేదని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఆందోళనకు గురై తరుణ్‌కు ఫోన్ చేయగా బయట ఉన్నా, ఇంటికి రాను అని సమాధానం ఇచ్చి, కట్‌చేసి, స్విచ్ఛాఫ్ చేశాడు. కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

మల్కాజిగిరి, మే 29: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ కథనం ప్రకారం... మచ్చ బొల్లారంకు చెందిన చంద్రశేఖర్(42) గత కొన్ని రోజులుగా మద్యం తాగుతూ తిరుగుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో మానసిక వేదనతో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు మెగా జాబ్ మేళా

గోల్నాక, మే 29 : పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (గ్రీన్‌ల్యాండ్స్) రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ వృత్తిలో రాణించే వారి కోసం రేపు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు హరి సందీప్, రాంరెడ్డి, లక్ష్మికుమారి తెలిపారు. 31న రాణిగంజ్ గుజరాతీ హైస్కూల్‌లో 30కి పైగా సంస్థలు పాల్గొంటున్నాయని, పదో తరగతి నుంచి ఎంబీఏ, డీఈడీ, బీఈడీ, ఎంఈడీ చేసిన 18-30 ఏండ్ల లోపువారు అర్హులన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలి : ఏఐఎస్ఎఫ్

ఉప్పల్, మే 29 : విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థల ఆగడాలను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. ఉప్పల్ భరత్‌నగర్‌లో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫీజుల పేరిట దోపిడీ చేస్తున్న విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో పేదవాడికి విద్య అందని ద్రాక్షగా మారుతుందన్నారు. నిబంధనలు తుంగలో తొక్కుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ అన్వర్, హరీశ్, అరవింద్, సాయి, నరేశ్, విద్యాసాగర్, వినయ్, శివ, బన్నీ , తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

మహేందర్ ఆత్మహత్యకు కారకులను అరెస్ట్ చేయాలి

పోలీస్ స్టేషన్ ఎదుట, రాజీవ్ రహదారిపై బాధిత కుటుంబీకులు, గ్రామస్తుల ఆందోళన

శామీర్‌పేట, మే 29 : వేధింపులు తాళలేక బలవన్మరణం చెందిన మహేందర్ కుటుంబానికి న్యాయం చేయాలని బాధిత కుటుంబీకులు, తుర్కపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. వేధింపులకు గురిచేస్తూ బలవన్మరణానికి కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని నిరసిస్తూ రాజీవ్ రహదారిపై, జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. తుర్కపల్లి గ్రామానికి చెందిన రుద్రబోయిన మహేందర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే..ఆత్మహత్యకు ముందు మహేందర్ తాను రూ.6 లక్షలు అప్పుగా తీసుకుని దాదాపు రూ.4 లక్షల 70 వేలు చెల్లించినా.. కట్టిన పైసలు మిత్తికే సరిపోతున్నాయని, మొత్తం డబ్బులు చెల్లించాలని వేధిస్తుండటంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్‌తో పాటు సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. దీంతో మహేందర్ మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబీకులు రాజీవ్ రహదారిపై, జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. సీఐ యాదయ్య వచ్చి వేధింపులకు కారణమైనవ్యక్తి పరారీలో ఉన్నాడని..త్వరలో పట్టుకుని అరెస్ట్ చేస్తామని బాధిత కుటుంబీలకు భరోసా ఇవ్వడంతో వెనుతిరిగారు. తర్వాత మహేందర్ అత్యక్రియలు నిర్వహించారు.

జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన నిర్వహిస్తున్న బాధిత కుటుంబీకులు

ఆదివాసీ విద్యార్థులకు వసతి గృహాలు ఏర్పాటు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, మే 29: ఆదివాసీ విద్యార్థులకు సరైన వసతి గృహాలు ఏర్పాటు చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం (ఏఎస్‌యూ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పాపారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పాపారావు మాట్లాడుతూ.. అడిక్‌మెట్‌లోని ఆదివాసీ బాలికల హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు, నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. అడిక్‌మెట్ హాస్టల్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న 250 గజాల స్థలంలో నూతన భవన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలపై పోలీసులకు శిక్షణా తరగతులు

ధృవ కళాశాలలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న మేడ్చల్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి

మేడ్చల్ రూరల్, మే 29 : కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించుకుని సక్రమంగా అమలు చేయాలని మేడ్చల్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి అన్నారు. సైబరాబాద్ పరిధి మేడ్చల్ డివిజన్‌లోని మేడ్చల్, సూరారం, దుండిగల్ పోలీస్‌స్టేషన్ల పోలీస్ సిబ్బందికి కొత్త క్రిమినల్ చట్టాలపై శిక్షణా తరగతులను బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని ధృవ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జులై 1 నుంచి కొత్త క్రిమినల్ చట్టాలు అమలులోకి రానున్నందున వాటిపై పూర్తి అవగాహన కల్పించుకోవాలని తెలిపారు. ఈ చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే వాటిని సక్రమంగా అమలు చేయగలుగుతారని, అందుకు ప్రతి కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ వరకు అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ..

రామంతాపూర్, మే 29 : ఇటీవల ప్రమాదారికి గురైన బీజేపీ మహిళా నాయకురాలు శివజ్యోతి చెయ్యి విరగడంతో బుధవారం హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన ఆమెను పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళాఅధ్యక్షురాలు శిల్పారెడ్డి, నాయకురాళ్లు పద్మారెడ్డి, బండి పద్మ, రాగి లతారెడ్డి పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE: M.M. DISTRICT :: AT :: MALKAJGIRI
O.S. No. 741 OF 2023

Between:
Sarikonda Anuradha Reddy ...Plaintiff
AND
B Swathi & Anr... ...Defendants
To
D1 B. Swathi, D/o Madhava Reddy, Aged about 35 Years, Occ: House Wife, R/o. H.No. 5-201, Krishna Nagar, Mallapur Village, Uppal Mandal, Hyderabad-500076.
D2 Shaik Ameer, S/o. Shaik Jalal, Aged about 81 years, Occ: Retd Emp, R/o. G-26, RR Labs, Tarnaka, Hyderabad-500007. ...Defendants

Whereas the Plaintiff filed the Suit for Declaration to declare the Sale Deeds executed in favour of Defendants are Invalid, Void, illegal, Non est. and not binding on the plaintiff. And restraining the Defendants, and their agents from interfering or inducting third parties into the Suit Schedule Property bearing Plot No. 515 in survey No's 229 to 246, measuring 267 Sq.Yds. situated at B.N.Reddy Nagar, Cherlapally(V), Kapra Mandal, Medchal-Malkajgiri District.The above suit is posted to 22-06-2024. You are hereby summoned to appear either in person or through your pleader with your defense if any at 10:30 A.M on the above said date before the Hon'ble court.

// BY ORDER OF THE COURT//
Sd/- B.CHANDHANA PRIYA,
Flat No. 201, Plot No. 74 & 75, KSR Rainbow Apartments, Visweshwaraya Engineers Colony, BN Reddy Nagar, Hyderabad-79